కథానిక :

# తప్పనిసరి

★

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

౧

"రాజీ, నిన్నొకటి అడుగుదామనుకున్నానే" అన్నది శాంత.

శాంతకేసి ప్రశ్నార్థకంగా చూసింది రాజ్యం. ఆమె ఏదో తనను అర్థించబోతున్నదని రాజ్యం ఊహించింది. శాంత గొంతులో ప్రార్థన వినిపించి కాదు; రాజ్యం శాంత ప్రార్థనలను వినదగిన స్థితిలో ఉండటంవల్ల-కొంతవరకు అమలు చేయదగిన స్థితిలోకూడా ఉండటంవల్ల. రాజ్యం వెయ్యిరూపాయల ఆర్జనగలవాడి కూతురు, శాంత నూటపాతిక రూపాయల సంపాదనగలవాడి కూతురు. ఇద్దరూ రెండేళ్ళపాటు ఇంటరు కలిసి చదివారు. అనేక కారణాలచేత ఈ ఇద్దరికీ మంచి దోస్తీ ఏర్పడింది. ఈ రెండేళ్ళ కాలంలోనూ రాజ్యం ఎన్నోసార్లు అనుకుంది—తనను శాంత ఏదో అడగబోతున్నదని. కాని ప్రతిసారీ ఆమె ఊహ అపోహ అవుతూనే వచ్చింది. శాంత తన కుటుంబదారిద్ర్యాన్ని ఇతరులదగ్గిర దాచినా రాజ్యం దగ్గిర ఎన్నడూ దాచటానికి ప్రయత్నించలేదు. అయితే ఆమె ఎన్నడూ రాజ్యాన్ని కించిత్తుసహాయం అర్థించలేదు. ఇద్దరూ ఇంటరు పాసయినారు. రాజ్యం బియ్యే చదువుతున్నది. శాంత చదువు మానేసింది. శాంత చదువు మానినందుకు రాజ్యమే ఎక్కువ విచారం వెలిబుచ్చింది. శాంత నవ్వేసింది.

"పిచ్చిదానా, మా అన్నకి సాగనిచదువు నాకేమిటి ?" అన్నదామె.

చదువు సంబంధం తెగిపోయినా శాంత అప్పుడప్పుడు రాజ్యందగ్గిరికి వస్తూనే ఉండేది, కాలేజి కబుర్లు వింటూండేది. రాజ్యంకూడా శాంతపట్ల ఇదివరకల్లేనే ప్రవర్తిస్తున్నదిగాని కొంచెమైనా మారలేదు. ఆమెకిప్పుడు కొందరు కొత్త సహాధ్యాయినులు ఏర్పడ్డా శాంతిస్థానం ఎవరూ ఆక్రమించినట్టు లేదు.

"శాంతా, నీచేతి బంగారపుగాజు లేంచేశావు?" అన్నది రాజ్యం ఒకసారి.

"అమ్మేశాను."

"ఏం ? అదేమిటే ?"

"తప్పనిసరి."

కొద్ది నెలలకాలంలో శాంత ఆకులు రాలిన మోడల్లే తయారయింది. రాజ్యం ఎన్ని ప్రశ్నలు వేసినప్పటికీ చిట్టచివరకు శాంతనుంచి ఒకటే సమాధానం వచ్చేది. "తప్పనిసరి."

ఇటీవల శాంతను చూసినప్పుడల్లా రాజ్యానికి ఒకవిధమైన నరాలలాగుడు ప్రారంభమయింది.

"ఈసారి నన్ను శాంత ఏదన్నా అడుగుతుంది. తప్పక అడుగుతుంది. నా సహాయంలేకుండా జరగని పరిస్థితి శాంతకు ముంచుకొస్తోంది" అనుకునేది రాజ్యం. ఆ అడిగేదేదో శాంత దబ్బున అడిగేస్తే బాగుండుననిపించేది రాజ్యానికి. ఈ "సస్పెన్స్" రానురాను దుర్భరమవుతున్నది.

శాంత దరిద్రస్థితిలో ఏమన్నా సహాయం తనను అర్థిస్తుందేమోనని రాజ్యం భయపడుతున్నట్టయితే పోనీ అనుకోవచ్చు. ఆమెకు అయిదో, పదో, పరకో కావాలన్నా శాంత ఇవ్వటానికి—కనీసం తన 'నాన్నారి' చేత ఇప్పించటానికి సిద్ధంగానే ఉందిగా. రెండేళ్ళక్రితం తన తల్లి పోయినప్పటినుంచీ తనను నెత్తిమీద పెట్టుకుని పూజిస్తున్న 'నాన్నారు' తాను కోరితే శాంతకు ఎంత సహాయమైనా చేస్తారాయె. శాంత ఎందుకు పస్తాయిస్తున్నదీ ?

శాంత పస్తాయిస్తున్నదనుకోవటానికి కూడా నిజానికి రాజ్యానికి ఆధారంలేదు. ఆమే తనను ఏదో కోరబోతున్నదానల్లే కూడా ఎన్నడూ కనపడలేదు.

పోనీ తనకు తానై, "ఏం, శాంతా ? నీకేమైన ఇబ్బందిగా ఉంటే నేను అంతో ఇంతో సహాయం చేస్తానే!" అందామంటే శాంత ఏమనుకుంటుందో. తమ ఇద్దరిమధ్యా ఎన్నడూ తలఎత్తని డబ్బు ఈ మాటతో వచ్చిపడి పండులాంటి స్నేహం పాడైపోతుందేమో.

ఒక్కోసారి రాజ్యానికి తనమీద తనకే విసుగొచ్చేది. ఒంటిమీద ఉన్నదంతా వొలిచి అమ్మకుంటున్న శాంతకులేని జంజాటం తనకెందుకూ? తనను శాంత ఎరగదా? బెట్టుకాకపోతే తనను దమ్మిడీ సహాయం అడక్కపోవటమేమిటీ? పైపెచ్చు తనకీ ఆరాటమేమిటీ?

## ౨

"మా అన్నయ్య కెక్కడా ఉద్యోగం దొరకటం లేదు, రాజీ. ఎన్ని దరఖాస్తులో పెడుతున్నాడు. కాళ్లకి బలపాలుకట్టుకు తిరుగుతున్నాడు, పాపం. మీ నాన్నగారి ఆఫీసులోగాని, ఇంకెక్కడన్నా గాని ఉద్యోగం దొరికితే బాగుణ్ణు" అన్నది శాంత. రాజ్యం ఊహించలేని బాధాకరమైన పరిస్థితిని తన మనసులో ఎదుర్కొంటున్నదానల్లే. తరవాత ఒక క్షణంఉండి తల ఎత్తి, "మీ నాన్నగారితో కాస్త చెబుతావా?"

రాజ్యానికి డొక్కు దిగినట్టయింది. శాంత గమనించకుండా నిశ్శబ్దంగా ఆమె ఒక దీర్ఘనిశ్వాసం విడిచింది. శాంత మాట్లాడుతుండగా దాదాపు ముప్పాతిక నిమిషంసేపు ఆమె శ్వాస విడవలేదు మరి.

"దాని కేం భాగ్యమే? అల్లాగే చెబుతాను. నాన్నారి ఆఫీసులో ఖాళీ ఉంటుందో లేదో చెప్పలేనుగాని ఆయన ప్రయత్నిస్తే మరోచోటనైనా దొరకొచ్చు" అన్నది రాజ్యం. తన కంగారు దాచుకోవటానికిగాను అవసరమైనదానికన్న ఒక వాక్యం అధికంగా చేర్చి.

కారణమేమంటే, శాంత "మా అన్నయ్య" అని ప్రారంభించగానే రాజ్యం ఆలోచన మరోమార్గాన పరిగత్తింది. శాంత అన్నయ్య బాగుంటాడు. తెలివిగలవాడు కూడా. కిందటేడు రెండుమూడు మాసాల పాటు రాజ్యం అతని ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరయింది. అదేమిటో అతను చిన్న మనోవ్యాధి అయి కూచున్నాడు. ఏపని చేస్తున్నా సరే, ఏమి అలోచిస్తున్నా సరే అకస్మాత్తుగా అతన్నిగురించి ఆలోచన రావటమూ, చిలవలూ పలవలూ వెయ్యటమూ, ఆ ఆలోచననుంచి రాజ్యం బయటపడలేకపోవటమూనూ. క్రమంగా ఈ మనస్థితిలోనుంచి రాజ్యం బయటపడి, ప్రపంచంలో ఇంకా చాలమంది అందగాళ్లూ, తెలివిగలవాళ్లూ, విదేశాలు తిరిగివచ్చినవాళ్లూ, డబ్బూ, మేడలూ, కార్లూ గలవాళ్లూ ఉన్నారని గుర్తించగలిగింది. అయితే పాతగాయంలాగా కొద్ది పచ్చి ఇంకా ఏ మూలో మిగిలిఉంది. తాను శాంత అన్నను గురించి కలలుగన్నకాలంలో శాంతకూడా తననూ ఆమె అన్ననూ గలిపి ఆలోచనలు జరిపిఉంటుందని రాజ్యం భ్రమ. అతనుకూడా తననుగురించి తనలాగే కలలుగని శాంతతో చెప్పిఉంటాడేమోనని ఆమెకు అనుమానం...కొంపదీసి శాంత, "మా అన్న నీకోసం మనోవ్యాధి పడుతున్నాడు. మీరిద్దరూ పెళ్లిచేసుకోకూడదా?" అనేస్తున్నదేమో ననుకున్నది రాజ్యం. కాని అటువంటిదేమీ జరుగలేదు.

ఇందువల్ల తనకు తృప్తే కలిగిందో, నిరాశే కలిగిందోకూడా రాజ్యం ఊహించలేకపోయింది. ఇప్పుడున్న మనస్థితిలో రాజ్యం శాంత అన్నను ఎట్లాగూ పెళ్లాడదు. కాని అతను తనకోసం బాధపడుతున్నాడని చెవులపడితే అదోక ఆనందంగా ఉండేది. తాను అతన్ని పెళ్లాడలేనందుకు—అతనంటే తనకు ఎంత గౌరవం ఉన్నా, శాంత తోబుట్టువని ఎంత ఆదరం ఉన్నా, పెళ్లాడటానికి అత్యావసరమైన అనిర్వచనీయ ప్రేమ అతనిపట్ల తనకు లేనందుకు—తన విచారాన్ని ఎంతో లలితంగా, శాంతకు—శాంతనుమించి ఆమె అన్నకు—ఏమాత్రమూ బాధకలగకుండా మాట్లాడటానికి ఎటువంటి మంచి అవకాశం!...

కాస్సేపు అదీ ఇదీ మాట్లాడి కాఫీతాగి శాంత వెళ్లిపోయింది.

రాజ్యం ఒంటరిగా కూచుని, తాను పెళ్లాడదన్న వార్త శాంత మోసుకుపోయినట్టయితే ఆమె అన్న ఏవిధంగా ఖేదపడేవాడో చాలాసేపు ఊహించుకున్నది.

## 3

భాస్కరరావుగారు ఏ చిత్తాన ఉన్నాడో గాని రాజ్యం చెప్పినమాట సాంతం వినిపించుకోకుండానే, "ఆఁ, ఉద్యోగా లెక్కడున్నై? ఇటువంటివన్నీ నువ్వు నెత్తిన పెట్టుకోకు" అన్నాడు.

శాంతకు ఆమాత్రం ఆశకూడా తాను ఇచ్చి ఉండటం పొరపాటే అయిందని రాజ్యం గ్రహించింది. "మా నాన్నారితో చెప్పటమైతే చెబుతాను

గాని నువ్వా శ్రీ ఆశపెట్టుకోకు. మీ అన్నను తన ప్రయత్నాలు మానవద్దని చెప్పు" అని ఉంటే చాలా బాగుండేది. శాంతమీద ఆమెకు చిరాకుకూడా వచ్చింది. ఆమె తనని ఇటువంటి ఇరుకులో ఎందుకు పెట్టాలీ? ఇంతకాలమూ నోరు తెరిచి ఒక్క సహాయం అడగనిమనిషి తన చేతిలోలేని ఈపని ఎందుకడగాలీ?

శాంత మళ్లీ రెండుమూడుసార్లు వచ్చింది, కాని తన అన్న ఉద్యోగంసంగతి హెచ్చరించనేలేదు. పాపం, పిచ్చి రాజ్యం నరాలన్నీ బిగబట్టుకు కూచునేది ఎప్పుడడుగుతుందో, ఏం చెబుదామా అని. ఇట్లా చెబితే బాగుంటుందని రాజ్యం ముందు "రిహార్స్" చేసుకోకకాదు. అదేం ఖర్మమో ఇటువంటి "రిహార్సల్స్" ఆమెకు ఎన్నడూ ఉపయోగించేవికావు. క్లాసులోకూడా అంతే. ఏ పాఠమో చదవనప్పుడు మేస్టరుకు చెప్పాలిసిన సమాధానం ముందుగా ఎంతో జాగర్తగా తయారుచేసుకుని తీరా క్లాసులో ఇంకో విధంగా చెప్పేది. ఏతత్ క్షణానికి ఆమె బుద్ధి కట్టుపడి కాళ్ళూ చేతులూ ఆడించలేని పరిస్థితిలో ఉన్నట్టయిపోయేది. రాజ్యం ఇప్పటికీ అంతే.

ఆఖరుకు మూడోసారి వచ్చినప్పుడు శాంతే అన్నది.

"పాపం, మీ నాన్నగార్ని శ్రమపడవద్దని చెప్పవే. మా అన్నయ్యకేదో చిన్న ఉద్యోగం దొరికేటట్టుగా ఉంది."

రాజ్యం చప్పుడుకాకుండా చిన్న నిట్టూర్పు విడిచింది. శాంతకంటె ఉత్తమురాలు నిజంగా ప్రపంచంలో లేదనుకున్నది ఆమె. అయితే దురదృష్టవశాత్తూ ఈ అభిప్రాయం అయిగునిమిషాలైనా నిల్వకుండానే శాంత రాజ్యంమొహాన అణువు బాంబు పేల్చినంతపని చేసింది.

"రాజీ, ఓమాటడుగుతాను నిజం చెబుతావా?" అన్నది శాంత.

"ఏమిటే?" అన్నది రాజ్యం.

"మీ నాన్నగారికి మళ్లీ పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదా?"

అప్పటికీ అణువుబాంబును శంకించలేదు పిచ్చి రాజ్యం.

"ఏం? అట్లా అడుగుతున్నావ్?"

"ఏంలేదు, రాజీ. ఆయనకు చేసుకునే ఆలోచనుంటే నన్ను చేసుకుంటారేమోనని!"

"నిన్నా!!!" అణువుబాంబు దెబ్బతిని ఆ మాత్రమైనా రాజ్యం అనగలగటం ఆశ్చర్యమే.

శాంతమనస్తత్వం ఎటువంటిదోగాని ఆమె కాస్తయినా చెక్కు చెదరలేదు, పిచ్చిమొగం వెయ్యలేదు, మొహానికి చేతులడ్డంపెట్టుకుని రాజ్యం మొహం చూడలేక నేరుగా ఇంటికి పరిగత్తలేదు. ఇటువంటివన్నీ శౌర్యాలనిపించింది రాజ్యానికి!

"తప్పేం, రాజీ?" శాంత గొంతు దీనంగా మటుకున్నది.

"నవ్వులకా? నిజంగా అంటున్నావా?"

"నిజంగానే, రాజీ!"

"నేనేమన్నా అనుకుంటానన్నైనా అనిపించటం లేదూ?"

"నీకన్న నాకు ఆప్తులెవరున్నారే?"

"ఇదేనా ఆప్తులతో అనేమాట?"

"నాకు తప్పు తోచలేదు సుమా!"

"మా నాన్నమీద ప్రేమఉండి పెళ్లాడతానంటున్నావనుకోమన్నావా?"

రాజ్యానికి ఉద్రేకంలోమాట, అనుకున్నదానికన్న చేవగానే వస్తున్నది.

"నే నామాట అనలేదే? నిజంగా నాకు ప్రేమంటే ఏమిటో తెలీదు రాజీ. మీ నాన్నగారంటే నాకు మొదటినుంచీ చాలా అభిమానం ఉంది. నేనెట్లాగూ ఎరగనివాణ్ణి చేసుకోవాలి—"

"వయసుమించినవాణ్ణి చేసుకోనవసరం లేదుగా?"

"ఎట్లా చెప్పగలవూ? మా నాన్న కుర్రవాళ్ళకి కట్నాలు పొయ్యలేడు."

"పొయ్యగలిగితే కుర్రాణ్ణి చేసుకోవాలని లేదూ?"

"ఉంటే?"

"అటువంటి కోరిక లోపల ఉంచుకుని మా నాన్నారిని చేసుకుంటా ననటం మోసంకాదూ?"

"అదేమిటె, రాజీ? డబ్బుంటే మేడల్లోఉండా

లని కోరిక ఉండొచ్చు. అందుకని పూరికొంపలో ఉండటం మోసం అవుతుందా ?"

దీనికేమనాలో రాజ్యం ఊహించలేకపోయింది. "మా నాన్నారి డబ్బు చూసికాదా నువ్వాయనను చేసుకుంటానంటున్నది ? ఆ సంగతి దాస్తావెందుకూ ?" అన్నదామె ఆఖరుకు.

"నేను దాయటంలేదు, రాజీ. మీ నాన్నగారికి ఎవరు పిల్లనిచ్చినా డబ్బు చూడకుండా ఇవ్వరు. నిజానికి ఆయన డబ్బు ఆయన వారసులకు పోతుంది గాని నాకేం ఒరుగుతుంది ? నాకు తిండీ, బట్టా తప్ప నగలుకూడా అక్కర్లేదు, రాజీ. నన్నోకరు బలవంతం చెయ్యటంలేదు. ఆయన ఇష్టపడితే నా అంతట నేను ఆయనను పెళ్లాడతాను. ఈమాత్రం గ్యారంటి ఆయనకింకో సంబంధమైతే ఉంటుందా ?"

రాజ్యం ఆలోచించింది. శాంత ప్రస్తావించే ఈ దిక్కుమాలిన విషయంగురించి తను ఆలోచించవలసి రావటంకూడా ఏమిటన్న ఆశ్చర్యం ఒక మూల ఉంచుకునే రాజ్యం ఆలోచించింది.

"నాకు సవితితల్లివి కావాలనా నీ ప్రయత్నం?" అన్నదామె చివరకు.

"నీకన్న ఆప్తురాలైన సవితికూతురు నాకు దొరుకుతుందా, రాజీ! మీ నాన్నగారిని కాస్త కనుక్కుంటావు గదూ ?"

శాంత వెళ్లిపోయినాక రాజ్యానికి ఆలోచిస్తున్న కొద్దీ తిక్కత్తుకొచ్చింది. శాంత ప్రస్తావించిన విషయం విడ్డూరంగా ఉంది. ఆమె తనతో ఈమాట అనటమేమిటి ? దాన్నిగురించి తాను అంతసేపు వితర్కించటమేమిటి ?

రాజ్యాని కింకొకటికూడా తట్టింది. ఆనాడు శాంత తన అన్న ఉద్యోగంగురించి కనుక్కోమని అడిగినట్టే ఇవాళ ఈ విషయమూ కనుక్కోమంటున్నది! తన "నాన్నారి" మీద ఆమెకు ప్రేమ ఉన్నట్టయినా కాస్త నటించగూడదూ ? పెళ్లిని ఉద్యోగంతో సమానం చేస్తుందా ? ఛీఛీ! ఎంత సంస్కారంలేని మనిషి ! తనకూ శాంతికూ సంస్కారంలో ఏమీ తేడా లేనట్టు ఇంతకాలమూ తాను భ్రమపడిందేగాని, లేకుండా ఎందుకుంటుంది ? ఇదుగో ! కనిపించటంలేదూ ? తాను ప్రాణంపోతేమటుకు ప్రేమించనివాణ్ణి పెళ్లాడుతుందా ? ఒకవేళ అది అక్షరాలా సాధ్యపడకపోతే పెళ్లాడినవాడిని ప్రేమించటానికైనా ప్రయత్నం చేస్తుందిగాని ఈ శాంతలాగా "తప్పనిసరి" పెళ్ళిచేసుకుంటుందా ? ఛీ ఛీ!

తనకు తప్పనిసరి కానిది శాంతకు తప్పనిసరి కావచ్చునన్నమాట రాజ్యానికి తట్టలేదు. ఆమె శాంతను తన ఇంటికిరాకుండా కట్టుదిట్టాలు చెయ్యటం మంచిదనుకున్నది.

ఆ రాత్రి ఆమె తన తండ్రితో, "ఏమిటండీ, నాన్నారూ, శాంత ఎంతో మంచిదని భ్రమపడ్డాను, ఛీఛీ!" అన్నది.

"ఏమమ్మా?" అన్నాడు భాస్కరరావుగారు.

"అది మీమీదే కన్నేసింది, నాన్నారూ!"

భాస్కరరావుగారు లోపల ఆశ్చర్యపోతూ, పైకి బిగ్గరగా నవ్వి, "నీ మొహం!" అన్నాడు.

"అవును, నాన్నారూ ? మీరు మళ్ళీ పెళ్లి చేసుకుంటే తనను చేసుకోవాలిట."

"పెళ్ళిళ్లేనే ఉంది!"

"బాగా చెప్పారు!"

౪

"రాజీ ?...రాజ్యం ఉందండీ ?"

"ఇప్పుడే కాలేజికి వెళ్లిందే" అన్నాడు భాస్కరరావుగారు, శాంత అందాన్ని మునుపెన్నడూ ఎరగనట్టు చూస్తూ.

"తొమ్మిదికే ?"

"ఏదో మీటింగుందన్నది."

"ఏంలేదు, ఒక్క మాట చెప్పిపోదామని వచ్చాను."

"ఏమిటది ? కూచో"

శాంత నవ్వుతూవచ్చి భాస్కరరావుగారికి అంతదూరాన కుర్చీలో కూర్చుంది.

"ఏమీలేదు, మా అన్నయ్యకు దొరుకుతుందనుకున్న ఉద్యోగం కాస్తా ఎనక్కుపోయింది. అందుచేత మీరేదన్నా చూస్తున్నట్టయితే మానవద్దని చెప్పమందామని వచ్చాను."

ఒక క్షణంపాటు శాంత ఏం చెబుతున్నదీ ఆయనకు అర్థంకాలేదు. శాంత అన్న ఉద్యోగం గురించి తాను పూర్వం వినిఉన్నట్టయినా ఆయనకు

జ్ఞాపకం లేదు. ఆపైన కిందటిమాటు శాంత తనతో అన్నమాటలు రాజ్యం తండ్రితో చెప్పనైనా లేదు. ఇన్నిటినీ మించిన కారణమేమంటే, రాజ్యం శాంతను గురించి చెప్పిన క్షణంనుంచీ ఆయన తీరికదొరికినప్పుడల్లా శాంతను తన భార్యగా ఊహించటానికి యత్నాలు చేస్తున్నాడు. ఈ యత్నాలు అంతకంతకూ ఫలోన్ముఖమవుతున్నై. ఇప్పుడామె తన ఎదురుగా కూర్చుని మాట్లాడుతుంటే ఆమెకూ తనకూ మధ్య అప్పుడే ఒక బంధం ఉన్నట్టే తోచింది భాస్కరరావుగారికి. ఈ ఆలోచనల్లో ఉన్న ఆ పెద్దమనిషి శాంత ఎత్తిన విషయాన్ని గురించి సరిగా వినిపించుకోలేకపోవటం కూడా జరిగింది.

అయితే ఆయన శాంతనోట ఆమె ఉన్న ఉద్యోగం విషయం వివరంగా తెలుసుకోక తప్పలేదు. అంతా విని ఆయన, "దానికేం భాగ్యం? అట్లాగే చూద్దాం. అతనికి ఉద్యోగమే దొరక్కపోతుందా?" అన్నాడు.

"థాంక్యూ!" అన్నది శాంత ఎంతో ఆప్యాయంగా.

"అయితే నీ పెళ్లి అనుకుంటున్నారుటగా?" అన్నాడు భాస్కరరావుగారు.

శాంత కొంచెం సిగ్గుగా నవ్వి, "రాజీ అన్నదా?" అని అడిగింది.

"కాదు. ఎవరో అనగా విన్నాలే."

"రాజీ అనిఉండదు లెండి. దానికి కోపం వచ్చింది" అన్నది శాంత చిన్నబుచ్చుకున్నట్టు.

"దేనికి? నువ్వేమన్నావేం?"

"ఏమంటేనేం లెండి. నేను అమాయకురాలినై అన్నానుగాని అనటం తప్పే. తరవాత నాకే తోచింది."

"ఏమన్నావని!"

"ఏమీ లేదు. మావాళ్లు కట్నాలిచ్చుకోలేక మరీ అడ్డమైన సంబంధాలూ చూస్తున్నారు—"

"రెండో పెళ్లీ, మూడో పెళ్లీ కావాలు."

"లేకపోతే కుర్రవాళ్ళనెక్కడ భరించగలరు చెప్పండి. మా నాన్న నన్నడిగాడు రెండో పెళ్ళయితే అభ్యంతరమా అని. లేదన్నాను—"

"ఏమట్లా? రెండోపెళ్లివాణ్ణి చేసుకునేకన్న ఏ బీదవాణ్ణో కుర్రవాణ్ణే చేసుకుంటే సరిపోనుగా?"

"బీదరికం ఒకటి అనుభవిస్తూనే ఉన్నాం. దానికితోడు కుర్రవాళ్లుకూడా దేనికి? మా బంధువుల్లోనూ ఎరిగున్నవాళ్లలోనూ కుర్రవాళ్లు పెళ్లాలను పెడుతున్న తిప్పలుమాస్తే పగదానిక్కూడా వద్దనిపిస్తున్నది."

భాస్కరరావు ఆశ్చర్యపడ్డాడుగాని శాంత మాటలు నమ్మగలిగాడు.

"ఇంతకూ రాజీతో ఏమన్నావు?"

"ఏమీ అనలేదు. రెండోపెళ్లి చేసుకోగలిగినప్పుడు ఎవరో ఎరగనివాళ్ళను చేసుకునేకన్న ఎరిగినవాళ్ళలో చేసుకుంటే బాగుంటుందనిపించింది. అమాటే రాజీతో అన్నాను."

"నన్ను చేసుకోవటానికి అందుకని ఒప్పుకున్నావన్నమాట."

శాంత ఆయనకేసి కాస్త బెదురుతున్నట్టు చూసి "రాజీ చెప్పలేదనుకున్నాను" అని తల వంచేసుకుంది.

"ఎందుకు చెప్పిందా అని పశ్చాత్తాప పడుతున్నావు కాదూ?"

"లేదు. రాజీతో అన్నందుకే పశ్చాత్తాపపడ్డాను. అది మీతో చెప్పినందుకు కాదు. మీరూ, రాజీ—ఎంతో దగ్గిరవాళ్ళల్లే తోచి—"శాంత పెదిమలు మణుకుచున్నది, ఏదో దిగమింగుతున్న దానల్లే.

"నిజం చెప్పు. పశ్చాత్తాప పడుతున్నావా, లేదా?"

"నేనన్నమాటకు రాజీ కోప్పడకుండా ఉంటే నాకేమీ పశ్చాత్తాపం లేదు."

"నాకు నలభైనాలుగేళ్లు. ఒప్పుకోగలను, జాగర్త."

శాంత కళ్లు పైకెత్తకుండానే నవ్వి తల ఆడిస్తూ, "నాకేం భయం లేదు" అన్నది.

ఆ క్షణాన భాస్కరరావు శాంతను యువకుడల్లే ప్రేమించాడు.

"సరే నీ సంగతి చెబుతాను...అన్నట్టు మీ అన్నయ్యను ఇవాళ సాయంకాలం అయిదుగంటలలోగా మా ఆఫీసుకొకసారి రమ్మను" అన్నాడు.